సాక్షి పెద్దపల్లి

శనివారం । 5 । జూలై । 2025



రోశయ్య సేవలు మరువలేనివి

పెద్దపల్లిరూరల్/గోదావరిఖని: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రోశయ్య జయంతిని తొలిసారి అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రోశయ్య చిత్రపటానికి సీపీ అంబర్‌కిషోర్ ఝూ పూలమాల వేసి నివాళి అర్పించారు.



న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

జూలపల్లి(పెద్దపల్లి): సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, సీజనల్ వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం అధికారి శ్రీరాములు సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దాపూర్‌లో డ్రై డే,ఫ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం జూలపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. వైద్యాధికారి సంపత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వివేకానందుని ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళి అర్పిస్తున్న రాంచందర్ తదితరులు

జ్యోతినగర్(రామగుండం): అంతర్జాతీయ వేదికలపై భారతీయ తత్వాన్ని చాటిన మహోన్నత ఆధ్యాత్మికవేత్త స్వామివివేకానంద అని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ అన్నారు. శుక్రవారం జాతీయ యువజన అవార్డు గ్రహీత ఈదునూరి శంకర్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్ జ్యోతిభవన్‌లో జరిగిన వివేకానంద వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళి అర్పించారు. దొంతుల శ్రీనివాస్, ఈదునూరి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

గోదావరిఖనిటౌన్(రామగుండం): ఆషాఢమాసం సందర్భంగా గోదావరిఖని నుంచి పలు పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక టూర్స్ ప్యాకేజీ కరపత్రాలను రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి, డిపో మేనేజర్ నాగభూషణం శుక్రవారం ఆవిష్కరించారు. అరుణాచలం, శ్రీశైలం, జోగులాంబ, కాణిపాకం, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, విజయవాడ, అన్నవరం, సింహాచలం, చిలుకూరు బాలాజీ ఆలయాలకు 4 సూపర్ లగ్జరీ ఏసీ బస్సులను నడుపుతున్నట్టు డీఎం తెలిపారు.

మా భూములిస్తే బతికేదెట్లా?



సర్వేను అడ్డుకుంటున్న రైతులు

రామగిరి(మంథని): 'జీవనాధారమైన మా భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయొద్దు' అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని రత్నాపూర్ గ్రామంలోని మేడిపల్లి శివారులో సుమారు 209 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా, శుక్రవారం సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకునే జీవిస్తున్న తాము భూములు కోల్పోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభ ఏర్పాటు చేయకుండా భూములను తీసుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రైతులు, గ్రామస్తులు కొండు లక్ష్మణ్, భద్రపు కృష్ణమూర్తి తదితరలున్నారు.

జలపాతం వైపు రావొద్దు



పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం సమీపంలోని గౌరీగుండాల జలపాతం వైపు రావొద్దంటూ పెద్దపల్లి రూరల్ పోలీసులు శుక్రవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సబ్బితం ప్రధాన రోడ్డు నుంచి జలపాతం వైపు వెళ్లే రోడ్డుకు అడ్డంగా బారికేడ్లను కూడా ఏర్పాటు చేశారు. జలపాతం వద్ద జాలువారే అందాలను వీక్షిస్తూ గతంలో ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారని, ఆ కారణంగానే ఎవరినీ అనుమతించడం లేదని ఎస్సై మల్లేశ్ తెలిపారు.

ముగిసిన మహిళా రెస్క్యూ సభ్యుల శిక్షణ

గోదావరిఖని(రామగుండం): రెండు వారాలపాటు ఆర్జీ–2 ఏరియా మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో కొనసాగిన మహిళా రెస్క్యూ సభ్యుల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. మహిళా సభ్యులకు సర్టిఫికెట్లు, డ్రెస్‌కోడ్‌లు అందించారు. రెస్క్యూ జీఎం కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా రెస్క్యూ సభ్యులకు సంస్థ చరిత్రలో మొదటిసారిగా శిక్షణ ఇచ్చామని తెలిపారు. విధినిర్వహణలో శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. రెస్క్యూ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, ఇన్‌స్ట్రక్టర్లు తిరుపతి, మూర్తి, ట్రైనర్లు కిషన్ రావు, రెస్క్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నరికినా బతికేస్తా



చావు వరకు వెళ్లి ప్రాణం పోసుకుంటోంది ఈ చెట్టు. దీన్ని నరికిన వ్యక్తి చూస్తే.. ఎందుకు నరికానా అని కన్నీళ్లు పెట్టుకునేలా.. ఆ నరికిన చేతులే తిరిగి దండం పెట్టేలా.. మొక్కవోని ధైర్యంతో కొత్త చిగురుతో పురుడు పోసుకుంటుంది. పచ్చని ప్రకృతి ఒడిలో కొత్తగా చిగురిస్తున్న ఆశల ఆనందం వెనుక కానరాని ఆటుపోట్లు ఆ చిగురుకే తెలియాలి. ఏ మాత్రం అవకాశమున్నా బతికేస్తా అంటూ ప్రాణకోటి జీవరాశులకు అద్దం పడుతోంది. బంధాలు మరిచి ఒకరినొకరు చంపుకుంటున్న మనుషులే.. తనను చంపినా చావనంటూ మనిషి జీవితానికి అర్థాన్ని చెబుతోంది. ఓ రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద మొండెం వరకు నరికి వదిలేసిన ఈ చెట్టు మళ్లీ చిగురిస్తూ వచ్చిపోయేవారికి జీవిత సారాంశాన్ని నేర్పిస్తోంది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామ శివారులో 'సాక్షి' కెమెరాకు చిక్కింది ఈ చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ప్రకృతి ఒడిలో ఒక్కటై..



చూసేందుకు ఏపుగా పెరిగి ఒకే చెట్టులా కనిపిస్తున్నా.. ఒకటి కాదు రెండు చెట్లు. పైన తాటి కింద రావి ఇలా అల్లుకుపోయి ఒక్కటయ్యాయి. దగ్గరికి వెళ్తే కానీ తెలియదు. మొక్క దశలోనే అల్లుకుపోవడంతో కనిపించనంతగా కలిసిపోయి చెట్లు రెండైనా మేము ఒక్కటే అన్నట్టు కనిపిస్తున్నాయి. పచ్చని ప్రకృతిలో రహదారిపై వచ్చిపోయే ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతోంది ఈ చెట్టు. ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలోని నంది పంప్‌హౌజ్ వద్ద విడదీయరాని బంధంలా ఒక్కటయిన తాటి, రావి చెట్టు 'సాక్షి'కి కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

60 డివిజన్ల రామగుండం

- మాయమైన పాత డివిజన్ల ముఖచిత్రం
- డివిజన్ల వారీగా ఇంటి నంబర్లతో కాలనీలు
- హద్దులపై వీడిన అయోమయం



రామగుండం నగరం

కోల్‌సిటీ(రామగుండం): నగరపాలక సంస్థలో కొత్తగా ఏర్పడిన 60 డివిజన్లతో రామగుండం బల్దియా రూపురేఖలు మారిపోయాయి. విలీనమైన లింగాపూర్, వెంకట్రావుపల్లి, ఎల్కలపల్లిగేట్, అక్బర్‌నగర్ గ్రామాలను కలిపి 60 డివిజన్లుగా పునర్విభజన చేస్తూ హద్దులతో కూడిన తుది జాబితాను విడుదల చేశారు. ఇప్పటి వరకు ఉన్న పాత 50 డివిజన్ల ముఖచిత్రం మాయమైంది. ఇటీవల సీడీఎంఏ నుంచి జారీ అయిన 60 డివిజన్ల పునర్విభజన తుది జాబితాలో కేవలం హద్దులు మాత్రమే ఉండడంతో, ఏ డివిజన్‌లోని ఏయే కాలనీలు వస్తాయో..? ఏ ఇంటి నంబర్ నుంచి ఏయే ఇంటి నంబర్ల వరకు వస్తున్నాయో అర్థంకాక మాజీ కార్పొరేటర్లతోపాటు ఆశావహులు తికమకపడ్డారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం 30 మంది వార్డు ఆఫీసర్లకు 60 డివిజన్లను కేటాయిస్తూ అధికారులు కొత్త డివిజన్ల పూర్తి జాబితాను అందజేశారు. దీంతో ఈ జాబితాతో డివిజన్లపై ఇప్పటి ఉన్న అయోమయం వీడింది. ఉత్తరం నుంచి తూర్పు, దక్షిణం, పడమర, తిరిగి ఉత్తరానికి సంబంధించిన డివిజన్ల హద్దుల ప్రకారం ఇంటి నంబర్లు, కాలనీలను పొందుపరిచారు.

కొత్త డివిజన్లలో కాలనీలు ఇలా..

- ఒకటో డివిజన్‌లో ఇందిరమ్మకాలనీ, పీకేరామయ్యకాలనీ, మేడిపల్లి విలేజ్ పరిధి వరకు. రెండో డివిజన్‌లో న్యూపోరట్‌పల్లి, జంగాలపల్లి, శాలపల్లి, కృష్ణానగర్. 3వ డివిజన్‌లో నర్రశాలపల్లి, మల్కాపురం, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, శ్రీనగర్‌కాలనీ, ప్రశాంత్‌నగర్. 4వ డివిజన్‌లో పవర్ హౌస్‌కాలనీ, ఐదో డివిజన్‌లో గంగానగర్ మిలీనియం క్వార్టర్స్. ఆరో డివిజన్‌లో జనగామ. 7వ డివిజన్‌లో జీఎం కాలనీలో టీ–2 క్వార్టర్లలో కొంత భాగం, ఐబీ కాలనీలో (1–385) కొంత భాగం. 8వ డివిజన్‌లో సీఎస్పీ కాలనీ, బాపూజీనగర్, ప్రియాంకానగర్. 9వ డివిజన్‌లో సూర్యానగర్, విద్యానగర్, లెనిన్‌నగర్.
- 10వ డివిజన్‌లో రాంనగర్‌లో కొంత భాగం, మల్లికార్జున్‌నగర్, సీతానగర్. 11వ డివిజన్‌లో
- రాంనగర్‌లో కొంత భాగం, భరత్‌నగర్, సంజయ్‌నగర్, ఫైవింక్లయిన్ చౌరస్తా, పరుశరాంనగర్. 12వ డివిజన్‌లో విఠల్‌నగర్ కొంత భాగం. 13వ డివిజన్‌లో
- విఠల్‌నగర్ కొంత భాగం. 14వ డివిజన్‌లో లంబాడీతండా, సింగరేణి స్కూల్ వెనకసైడ్, తారకరామనగర్, భాస్కర్‌రావు నగర్. 15వ డివిజన్‌లో షాపింగ్ కాంప్లెక్స్, పోలీస్ క్వార్టర్లు, కేకే నగర్, కుమారస్వామినగర్, వెంకటరావుపల్లి. 16వ డివిజన్‌లో షిర్కే బస్‌స్టాప్ ఏరియా, ఇటాలియ్ విగ్రహం నుంచి అబ్దుల్‌కలాం స్టేడియం క్వార్టర్లు. 17వ డివిజన్‌లో సింగరేణి క్వార్టర్లు, షిర్కే బస్టాప్ ఏరియా, అబ్దుల్‌కలాం స్టేడియం వెనుక క్వార్టర్లు, సంతోష్‌నగర్. 18వ డివిజన్‌లో 8వ కాలనీలోని హనుమాన్‌నగర్ సీఈఆర్ క్లబ్ ఎదురు, హనుమాన్ టెంపుల్ వెనుక క్వార్టర్లు. 19వ డివిజన్‌లో అల్లూరు, సంతోష్‌నగర్.
- 20వ డివిజన్‌లో న్యూమారేడుపాక, రెడ్డికాలనీ, పోతనకాలనీ, గోపాల్‌నగర్. 21వ డివిజన్‌లో లక్ష్మీపురం, వీర్లపల్లి, ఎఫ్‌సీఐ ఎల్కపల్లి గేట్ (జీపీ). 22వ డివిజన్‌లో గౌతమినగర్, చైతన్యపురికాలనీ, ఎఫ్‌సీఐ క్వార్టర్లు, ఎల్కపల్లిగేట్. 23వ డివిజన్‌లో గౌతమినగర్, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, ప్రగతినగర్, మాతంగికాలనీ, శాంతినగర్, కాజీపల్లి. 24వ డివిజన్‌లో ఎన్టీపీసీ టీటీఎస్, ఎఫ్‌సీఐ ఎక్స్‌రోడ్, ఎన్టీపీసీ పీటీఎస్. 25వ డివిజన్‌లో మల్యాలపల్లి, జీరో పాయింట్, పోస్ట్ ఆఫీస్ బ్యాక్‌సైడ్, రైల్వే అండర్‌పాస్. 26వ డివిజన్‌లో అక్బర్‌నగర్, ఎస్టీ కాలనీ, రైల్వేక్వార్టర్లు. 27వ డివిజన్‌లో విద్యుత్‌నగర్, సబ్‌స్టేషన్ ఏరియా, అంబేడ్కర్‌నగర్, ముబారక్‌నగర్. 28వ డివిజన్‌లో విలేజ్ రామగుండం, పాములపేట, రామాలయం టెంపుల్ ఎదురుగా, పాత బజార్. 29వ డివిజన్‌లో లింగాపూర్, ఈఎస్ఐ ఆస్పత్రి ఏరియా, హౌజింగ్‌బోర్డుకాలనీ.
- 30వ డివిజన్‌లో అయోధ్యనగర్, రామాలయం ఏరియా. 31వ డివిజన్‌లో క్రషర్‌నగర్, సుభాష్‌నగర్, ఆటోనగర్, భీమునిపట్నం కొంతభాగం. 32వ డివిజన్‌లో మేడిపల్లిసెంటర్, భీమునిపట్నంలో కొంత భాగం. 33వ డివిజన్‌లో అన్నపూర్ణకాలనీ, అంబేడ్కర్‌నగర్, మేరకాలనీ. 34వ డివిజన్‌లో కృష్ణానగర్. 35వ డివిజన్‌లో సప్తగిరికాలనీ, ఐబీకాలనీ కొంత భాగం, రాజ్యలక్ష్మికాలనీ. 36వ డివిజన్‌లో బస్టాండ్‌కాలనీ, జైభీంనగర్, గాంధీనగర్. 37వ డివిజన్‌లో హనుమాన్‌నగర్‌లో కొంతభాగం, గాంధీనగర్‌లో కొంతభాగం. 38వ డివిజన్‌లో హనుమాన్‌నగర్ కొంతభాగం, అంబేడ్కర్‌నగర్, సీతానగర్. 39వ డివిజన్‌లో శివాజీనగర్, లక్ష్మీనగర్, అశోక్‌నగర్.
- 40వ డివిజన్‌లో ఎల్బీనగర్, మేదరిబస్తీ, కళ్యాణ్‌నగర్. 41వ డివిజన్‌లో ఎల్బీనగర్ కొంత భాగం. 42వ డివిజన్‌లో జవహర్‌నగర్, తిలక్‌నగర్ కొంతభాగం. 43వ డివిజన్‌లో
- ఫైవింక్లయిన్ ఏరియా, జవహర్‌నగర్. 44వ డివిజన్‌లో 7బీకాలనీ, ఎస్‌సీ క్వార్టర్లు, సిక్ హాస్పిటల్, క్రషర్ ఏరియా. 45వ డివిజన్‌లో చంద్రశేఖర్‌నగర్. 46వ డివిజన్‌లో రాజీవ్‌నగర్ కొంతభాగం, సంజయ్‌గాంధీనగర్, ఇందిరానగర్. 47వ డివిజన్‌లో శివనగర్, కృష్ణాటెంపుల్, వెంకటేశ్వరకాలనీ, దుర్గానగర్, లూర్దునగర్, శాంతినగర్ కొంతభాగం. 48వ డివిజన్‌లో కేసీఆర్‌కాలనీ, చంద్రబాబుకాలనీ, ఆర్టీసీకాలనీ, సాయినగర్, ప్రగతికాలనీ, పద్మావతికాలనీ. 49వ డివిజన్‌లో ఎల్లందు గెస్ట్‌హౌజ్, మార్కండేయకాలనీ, శారదానగర్ (సింగరేణి క్వార్టర్లు), బృందావన్‌కాలనీ, సిద్ది వినాయకనగర్, కేశవకాలనీ, పద్మావతి కాలనీ(అపార్ట్‌మెంట్స్).
- 50వ డివిజన్‌లో అశోకనగర్, గాంధీనగర్ కొంత భాగం. 51వ డివిజన్‌లో లక్ష్మీనగర్, అశోకనగర్. 52వ డివిజన్‌లో కళ్యాణ్‌నగర్, అడ్డగుంటపల్లి కొంతభాగం. 53వ డివిజన్‌లో ఎల్బీనగర్ కొంతభాగం, తిరుమల్‌నగర్. 54వ డివిజన్‌లో రమేశ్‌నగర్, జవహర్‌నగర్. 55వ డివిజన్‌లో తిలక్‌నగర్, తిలక్‌నగర్‌డౌన్. 56వ డివిజన్‌లో తిలక్‌నగర్ కొంతభాగం, రమేశ్‌నగర్, ద్వారకనగర్ కొంత భాగం. 57వ డివిజన్‌లో ద్వారకానగర్ కొంతభాగం, ఎన్టీఆర్‌నగర్, కాకతీయనగర్. 58వ డివిజన్‌లో అడ్డంగుంటపల్లి. 59వ డివిజన్‌లో మార్కండేయకాలనీ, అశోకనగర్. 60వ డివిజన్‌లో మారుతినగర్, అడ్డగుంటపల్లి, లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- హోటళ్లలో తనిఖీలు చేపడుతాం
- 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) జె.అరుణశ్రీ



కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) జె.అరుణశ్రీ తెలిపారు. శుక్రవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి చక్కటి స్పందన వచ్చింది. 'పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంటుందని, రోడ్లపై మురుగునీరు పారకుండా డ్రెయినేజీలు నిర్మించాలని, పిచ్చిమొక్కల తొలగింపు, దోమల నివారణ తదితర సమస్యలను..' జిల్లాలోని పలువురు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అదనపు కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సమస్య: రామగుండంలోని ఆటోనగర్‌లో యూజీడీ నుంచి మురుగునీరు లీకవుతోంది. రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదు. లైట్లు కూడా వెలగడం లేదు. మూడేళ్లుగా అనేక సమస్యలతో జనం ఇబ్బందులు పడుతున్నారు.
– దొమ్మటి శేఖర్, ఆటోనగర్, రామగుండం

అదనపు కలెక్టర్: వెంటనే చర్యలు తీసుకుంటాం. రామగుండం కార్పొరేషన్ అధికారులను ఆటోనగర్‌కు పంపిస్తాం.

సమస్య: పెద్దపల్లి పాతబజార్‌లో కల్వర్టు నిర్మించి రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. 9 నెలలుగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. మున్సిపాలిటీకి ఫీజులు చెల్లించకుండా అనాథరైజ్డ్ లేఅవుట్లు వెలుస్తున్నాయి. బల్దియా ఆదాయాన్ని నష్టపోతోంది. చర్యలు తీసుకోండి.
– ఎం.రమేశ్‌గౌడ్, పెద్దపల్లి

అదనపు కలెక్టర్: మీరు చెప్పిన సమస్య పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్‌తో చర్చిస్తాం. అనాథరైజ్డ్ లేఅవుట్లపై నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

సమస్య: పెద్దపల్లిలోని చాలా హోటళ్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. తినుబండరాల నాణ్యత, శుభ్రత పాటించడం లేదు. ఆహారంలో బొద్దింకలు వస్తున్నాయి. హోటళ్లపై చర్యలు తీసుకోవాలి. కమాన్ దగ్గర టాయిలెట్స్ నిర్మించాలి.
– తిరుపతిగౌడ్, సదానందం, పెద్దపల్లి

అదనపు కలెక్టర్: ఇటీవల మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మరోసారి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తాం. టాయిలెట్స్ నిర్మాణంపై కమిషనర్‌కు చెబుతాం.

సమస్య: పెద్దపల్లిలోని బాపూజీనగర్‌లో రోడ్డు బాగాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా గుంతలుపడ్డాయి. రోడ్డు నిర్మించే వరకు కనీసం మట్టి పోయించండి.
– అలీం, పెద్దపల్లి

అదనపు కలెక్టర్: మున్సిపల్ కమిషనర్‌కు చెప్పి మట్టిపోయించేలా చర్యలు తీసుకుంటాం.

సమస్య: ఎన్టీపీసీలోని ఇందిరమ్మకాలనీ హనుమాన్‌గుడి సమీపంలో రోడ్డు నీటితో నిండిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డుపై నేను కూడా జారిపడ్డాను. వెంటనే సమస్య పరిష్కరించాలి.
– బండి పల్లవి, ఎన్టీపీసీ

అదనపు కలెక్టర్: చర్యలు తీసుకుంటాం. రామగుండం మున్సిపల్ అధికారులను పంపిస్తాం.

రోడ్డు నిర్మాణంపై కూడా అధికారులతో చర్చిస్తాం.

సమస్య: లక్ష్మీపురంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. రోడ్డు కూడా బాగాలేదు. శ్మశానవాటికలో కనీసం బోర్ కూడా లేదు.
– రాజబాబు, లక్ష్మీపురం, ఆర్ఎఫ్‌సీఎల్

అదనపు కలెక్టర్: యూజీడీ, రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలుస్తాం. శ్మశానవాటికలో బోర్ వెల్ ఏర్పాటు చేయిస్తాం.

సమస్య: పెద్దపల్లిలోని రంగంపల్లిలో పాఠశాలకు వెళ్లే రోడ్డులో పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగి రాకపోకలకు విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. యూజీడీ సమస్య కూడా ఉంది.
– అజ్మద్, రంగంపల్లి, పెద్దపల్లి

అదనపు కలెక్టర్: రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.

సమస్య: గోదావరిఖని సంజయ్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు. పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
– బొడ్డు రాజేశం, గోదావరిఖని

అదనపు కలెక్టర్: సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ముందుగా పిచ్చి మొక్కలు, చెట్లను తొలగిస్తాం.

సమస్య: గోదావరిఖని ఎల్బీనగర్‌లోని మాతంగికాంప్లెక్స్ వద్ద కుక్కలబెడద తీవ్రంగా ఉంది. సమీపంలోనే విద్యాసంస్థలున్నాయి. రోడ్డుపై వెళ్తున్న విద్యార్థులతోపాటు వాహనదారులపై దాడి చేస్తున్నాయి. గాంధీనగర్‌లో కూడా కుక్కల బెడద ఎక్కువగా ఉంది.
– దూడపాక మల్లేశ్, రవి, గోదావరిఖని

అదనపు కలెక్టర్: కుక్కల బెడద లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

సమస్య: గోదావరిఖని అశోకనగర్‌లో ఎస్ఆర్ఆర్ బ్యాక్‌సైడ్‌లో రోడ్డుకు అప్రూవల్ వచ్చినా నిర్మాణం చేపట్టలేదు. పిచ్చిమొక్కలను తొలగించాలి.
– నిజామొద్దీన్, గోదావరిఖని

అదనపు కలెక్టర్: పిచ్చిమొక్కల తొలగించేలా చర్యలు తీసుకుంటాం. రోడ్డును పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశిస్తాం.

సమస్య: ఆర్ఎఫ్‌సీఎల్ సమీపంలోని చైతన్యపురి కాలనీలో మా ఇంటి ముందు యూజీడీ నిర్మాణం కోసం తవ్వి వదిలేశారు. మా ఇంట్లో వెళ్లడానికి కర్రలు వేసుకొని నడుస్తాం. మా నాన్న అదుపుతప్పి పడిపోయాడు. చర్యలు తీసుకోండి.
– రవి, గోదావరిఖని.

అదనపు కలెక్టర్: సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

సమస్య: గోదావరిఖని ఎల్బీనగర్‌లోని సీనియర్ సిటిజన్ హాల్ వెనక సెప్టిక్‌ట్యాంక్ క్లీన్ చేయడానికి మార్గం లేదు. సమీపంలోని యూజీడీకి కనెక్షన్ ఇవ్వండి. జవహర్‌నగర్‌లోని నవోదయ స్కూల్ సమీపంలో కల్వర్టు వద్ద రోడ్డు నిర్మించాలి.– ఉదయ్‌రాజ్, గోదావరిఖని

అదనపు కలెక్టర్: సమస్య పరిశీలనకు ఇంజినీరింగ్ విభాగం అధికారులను పంపిస్తాం.

నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రోడ్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా అమలు చేసేలా అధికారయంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీసీపీ కరుణాకర్‌తో కలిసి సమీక్షించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. ఉల్లంఘించే వారిని గుర్తించి చర్యలు చేపట్టేందుకు ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సీసీ కెమెరాలతో నిఘా పెంచాలన్నారు.

సీఎంఆర్ఎఫ్‌లో 'ఫేక్' దరఖాస్తులు

జిల్లానుంచి ఉన్నతాధికారులకు అందిన సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల్లో ఫేక్ దరఖాస్తులు ఉన్నట్టు హైదరాబాద్ అధికారులు అనుమానించారని కలెక్టర్ పేర్కొన్నారు. సదరు దరఖాస్తులను వెరిఫై చేయాలంటూ ఆదేశాలందాయని వివరించారు. ఇందుకు పోలీసు శాఖ అధికారుల సహకారంతో ముందుకు సాగాలని సూచించారు.

పాఠశాలల్లో ఆత్మీయతాభావం పెంచాలి

జిల్లాలోని పాఠశాలల్లో ఆత్మీయతాభావం పెంపొందించడమే లక్ష్యంగా ప్రాజెక్టుశక్తి కార్యక్రమాన్ని అమలు చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. విద్యార్థుల్లో సమానత్వం పెంపొందించాలన్నారు. ఆర్డీవో గంగయ్య, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, ఆర్టీవో రంగారావు, డీఈవో మాధవి తదితరులున్నారు.

నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలి

జ్యోతినగర్(రామగుండం): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం ఆడిటోరియంలో బీఎల్‌వోలు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫామ్ 6,7,8ల విచారణ, నివేదిక సమర్పించడం, బూత్ లెవల్ అధికారి యాప్ వాడకం, ఓటర్ల జాబితా శుద్ధీకరణపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రామగుండం, అంతర్గాం, పాలకుర్తి తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా



తనిఖీ చేస్తున్న డీఏవో ఆదిరెడ్డి

జూలపల్లి(పెద్దపల్లి): వ్యవసాయ అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎరువుల నిల్వలు, ఆగ్రోస్, ప్రైవేటు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ప్రత్యూషతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ, ఇప్పటి వరకు 106 టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందని, మరో 1,394 టన్నులు ఈ సీజనుకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని రైతులకు 57 మెట్రిక్ టన్నుల యూరియా, 103 టన్నుల కాంప్లెక్స్, 11 టన్నుల పోటాష్, 13 టన్నుల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ అందుబాటులో ఉందని చెప్పారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సొసైటీ సీఈవో సురేశ్ తదితరులు ఉన్నారు.

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

పెద్దపల్లిరూరల్: విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలోని మహాత్మజ్యోతిబా పూలే విద్యాలయం విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. తాను కూడా గురుకులంలోనే చదివి ఈ స్థాయిలో ఉన్నానని గుర్తు చేసుకున్నారు. ఇంటర్నెట్ చేతిలో ఉంటే ప్రపంచమంతా ముందున్నట్టే అనిపిస్తోందని, అయితే అందులో మంచి, చెడు తెలుసుకుని మంచిని స్వీకరిస్తేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా బాలికలే ఫలితాల్లో ముందువరసలో ఉన్నారన్నారు. ఎస్సై లక్ష్మణ్‌రావు, కాలేజీ ఆర్‌సీవో అంజలి, ప్రిన్సిపాల్ మణిదీప్తి, నశాముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు

జగిత్యాలజోన్: పాతకక్షలతో ఓ కుటుంబంపై హత్యాయత్నం చేసిన ముగ్గురికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వెంకటమల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ శుక్రవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. పెగడపల్లి మండలం రాములపల్లి గ్రామానికి చెందిన తోట మహేందర్‌కు, తోట అనిల్, తోట మారుతి, తోటజ్యోతి మధ్య భూ తగదాలున్నాయి. 2019 ఆగస్టు 16న ఇంటివద్ద ఉన్న మహేందర్ కుటుంబసభ్యులపై తోట అనిల్, తోట మారుతి, తోట జ్యోతి మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. మహేందర్ అన్న, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. మహేందర్ తప్పించుకుని పారిపోయాడు. ఈ ఘటనపై పెగడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జీవన్ కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేసి, చార్జ్‌షీట్ దాఖలు చేసారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, కె.త్రివేణ్, కేవీ.ప్రసాద్‌లు బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో ముగ్గురికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్లు..

మంథని: తాగిన మైకంలో ఇసుకలారీని అతివేగంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్ పడాల శ్రీధర్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డా.టి.శ్రీనివాసరావు తీర్పు ఇచ్చారు. మంథని సీఐ రాజు తెలిపిన వివరాలు.. 2021 నవంబర్ 14న మంథని మండలం బిట్టుపల్లి శివారులో రోడ్డు పక్కన నిలబడి ఉన్న చిలువేరి గట్టయ్య, దరుగుల రాయమల్లును ఇసుకలారీ ఢీకొట్టగా మృతిచెందారు. ఈ మేరకు కోర్టులో నేరం రుజువు కావడంతో శ్రీధర్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని గొల్లపల్లి రోడ్డులో దొంగలించిన ఆటోలో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని, కిలోన్నర గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. పట్టణంలోని జాంబాగ్ ప్రాంతానికి చెందిన ఎంటీ.అక్తర్ ఇటీవల ఓ ఆటోను దొంగిలించాడు. అందులో శుక్రవారం మధ్యాహ్నం గొల్లపల్లి నుంచి కిలోన్నర గంజాయి తీసుకొస్తున్నారు. మార్గమధ్యలో వాహనాలు తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ కరుణాకర్ అనుమానం వచ్చి ఆటోను తనిఖీ చేశారు. అందులో కిలోన్నర గంజాయి పట్టుబడింది. ఆటో, గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు.

బైక్ చోరీకి యత్నించిన ముగ్గురిపై కేసు

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లిలో ఓ ఇంటి ఎదుట నిలిపిఉన్న బైక్‌ను అపహరించేందుకు యత్నించిన ముగ్గురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పలుమారు విజయ్‌యాదవ్ తన బైక్‌ను ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. గురువారం రాత్రి మండలంలోని మద్దులపల్లికి చెందిన తోడెటి మధు, కంబాల రమేశ్, తోడెటి రాకేశ్ బైక్‌ను అపహరించే యత్నం చేశారు. విజయ్‌యాదవ్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మంథనిరూరల్: మంథని మండలం నాగేపల్లి శివారులో మంథని- కాటారం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన పాగే శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీనివాస్ తన ద్విచక్రవాహనంపై మంథని నుంచి అడవిసోమన్‌పల్లికి వెళ్తున్న క్రమంలో నాగేపల్లి సమీపంలో లారీ ఢీకొట్టింది. అయితే ప్రమాదం జరిగిన తర్వాత స్థానికులు, వాహనదారులు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

నకిలీ డ్రగ్స్ దందా!

- కరీంనగర్‌లో జోరుగా నకిలీ మందుల విక్రయాలు
- ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ ఏజెన్సీలు
- వేణు ఏజెన్సీ డీలర్‌షిప్ రద్దు చేసిన సన్‌ఫార్మా
- అధికారుల ఉదాసీనతతో పేట్రేగుతున్న మాఫియా



నకిలీగా గుర్తించిన లెవిపిల్-500 ట్యాబ్లెట్లు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ కేంద్రంగా డ్రగ్ మాఫియా విచ్చలవిడిగా దందా సాగిస్తోంది. అక్రమ ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. బహిరంగంగానే నకిలీ మందులను రోగులకు అంటగడుతూ అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నారు. కొంతకాలంగా ఈ మాఫియా అధికారుల కళ్లుగప్పి ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీ మందులను తీసుకువచ్చి రిటైల్ వ్యాపారులకు ఇస్తూ రోగులు ప్రాణాపాయ స్థితికి వెళ్లేందుకు కారణమవుతున్నారు. ఈ మందులతో రోగాలు పోవడం దేవుడెరుగు కొత్త రోగాలు వస్తుండడం, ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. మందులు నకిలీవో... అసలువో.. అవి రాస్తే ఏం జరుగుతుందో తెలియక డాక్టర్ల పరిస్థితి అగమ్యగోచంగా తయారవుతోంది. అధికారుల ఉదాసీనతతోనే డ్రగ్ మాఫియా పేట్రేగిపోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రముఖ కంపెనీ పేరుతో..

కరీంనగర్‌కు చెందిన వేణు మెడికల్ ఏజెన్సీస్ పక్షవాతం వచ్చిన పేషెంట్లకు వాడే లివిపిల్-500 మెడిసిన్‌ను ప్రముఖ సన్‌ఫార్మా కంపెనీ తయారు చేస్తుండగా, ఆ కంపెనీ నుంచి డీలర్‌షిప్ హక్కును పొందింది. అక్రమ సంపాదనకు అలవాటు పడిన సదరు ఏజెన్సీ నిర్వాహకులు సన్ ఫార్మా నుంచి మందులు తెప్పించకుండా అధిక కమిషన్ల కోసం ఉత్తరప్రదేశ్ నుంచి తెప్పిస్తున్నట్లు గత ఏప్రిల్ నెలలో డ్రగ్ అధికారుల విచారణలో తేలింది. ఈ విషయమై సన్‌ఫార్మా కంపెనీకి సమాచారాన్ని అందించడంతో నకిలీదని కంపెనీ ల్యాబ్ రిపోర్టుతో కరీంనగర్ డ్రగ్ అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. సన్‌ఫార్మా పంపిణీ చేసిన బ్యాచ్ నంబర్‌కు వేణు ఏజెన్సీలో ఉన్న మందులకు సంబంధం లేకపోకపోవడంతో నకిలీ మందులుగా గుర్తించి సన్‌ఫార్మా డీలర్‌షిప్‌ను రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెట్టారు.

నకిలీ మందుల మూలాలపై దృష్టి

వేణు ఏజెన్సీ ద్వారా సరఫరా అవుతున్న లివిపిల్-500 నకిలీ మెడిసిన్ ఎవరు సరఫరా చేస్తున్నారనే విషయమై డ్రగ్ కంట్రోల్ అథారిటీ ద్వారా ఆరా తీస్తున్నాం. నకిలీ మందులు తయారు చేసే వారితో పాటు వాటిని తెప్పించి విక్రయించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే విధంగా కేసులు నమోదు చేస్తాం. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నకిలీ మందుల సరఫరాపై ఉపేక్షించేది లేదు.

– కార్తీక్ భరద్వాజ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్

ఈ మందులు ఎక్కడెక్కడికి వెళ్లాయి

పక్షవాతం వచ్చిన రోగులకు వాడే లివిపిల్-500 నకిలీ మందులను సరఫరా చేస్తున్న వేణు ఏజెన్సీ ఈ మందులను ఎక్కడెక్కడి రిటైల్ మందుల షాపులకు పంపిణీ చేసిందనే విషయంపై డ్రగ్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఒక వేళ రోగులకు చేరితే రోగం తగ్గకపోగా మరింత ముదిరే ప్రమాదముండడంతో లివిపిల్-500 నకిలీ మెడిసిన్ నిలువరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. డ్రగ్ అధికారులు ఫిర్యాదులు వచ్చినప్పుడే తూతూ మంత్రంగా తని ఖీలు చేస్తుండడం, మిగతా సమయంలో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నా యి. ఇది ఒక్క వేణు ఏజెన్సీకి సంబంధించన విషయమే. ఇలాంటి నకిలీ మందులు సరఫరా చేస్తున్న ఏజెన్సీలు నగరంలో ఉన్నాయని వాటిపై దృష్టిసారించి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- ఇందిరమ్మ ఇండ్ల ఇసుక పక్కదారి
- 13 ట్రాక్టర్లపై కేసు


వెంకటాపూర్‌లో రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులోని మానేరువాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలించడానికి వాగులోకి దిగిన ట్రాక్టర్లపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఇందిరమ్మ ఇండ్లకు వెంకటాపూర్ నుంచి ఇసుకను తరలించడానికి 33 ట్రాక్టర్లకు అనుమతులు ఇచ్చారు. అయితే ఉదయం 7 గంటలకే 13 ట్రాక్టర్లను వాగులోకి తీసుకెళ్లి ఇసుకను నింపుతుండగా.. సమాచారం అందుకున్న అధికారులు అక్కడికి వెళ్లి పోలీసుల సహకారంతో ట్రాక్టర్‌లను సీజ్ చేశారు. అధికారుల రాకను ముందే తెలుసుకున్న కొందరు ట్రాక్టర్లతోపాటు పరారయ్యారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సుజాత మాట్లాడుతూ ఇసుకను పక్కదారి పట్టించడానికి ట్రాక్టర్ల యాజమానులు సమయం కంటే ముందే వాగులోకి దిగడంతో పట్టుకున్నామన్నారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంఏలో సిలబస్‌గా 'లాంగ్ మార్చ్'


పెద్దింటి అశోక్‌కుమార్

సిరిసిల్ల: రాష్ట్రంలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ఎంఏ రెండో సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశంగా ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ నవల 'లాంగ్‌మార్చ్' ఎంపికైంది. ఇప్పటికే ఈ నవల ఉస్మానియా యూనివర్సిటీలో సిలబస్‌గా ఉంది. నల్గొండలోని నాగార్జున కళాశాల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం మానవ సంబంధాలపై పెద్దింటి రాసిన 'జిగిరి' నవల పాఠ్యాంశంగా ప్రవేశ పెడుతున్నారు. ఈ నవల ఇప్పటికే 12 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. ఈ రెండు నవలలు త్వరలో సినిమాలుగా రానున్నాయి. ఇప్పటికే సినీ నటుడిగా, పాటలు, మాటల రచయితగా గుర్తింపు పొందారు.



పాఠ్యాంశాలైన 'జిగిరి', 'లాంగ్ మార్చ్' నవలలు

పెద్దింటి అశోక్ కుమార్ రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేట వాసి. ప్రస్తుతం సిరిసిల్లలోని రాజీవ్‌నగర్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

మాయమాటలు చెప్పి బంగారంతో ఉడాయించి


మోసపోయిన లక్ష్మి

వీర్నపల్లి(సిరిసిల్ల): గుర్తుతెలియని బిచ్చగాడు మహిళకు మాయమాటలు చెప్పి బంగారం ఎత్తుకెళ్లిన ఘటన వీర్నపల్లి మండలం అడవిపదిరలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాలు. అడవిపదిరకు చెందిన చింతల్‌ఠాణం లక్ష్మి శుక్రవారం ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇది గమనించిన ఓ బిచ్చగాడు వచ్చి.. నీ కొడుకుకు ప్రాణగండం ఉందని భయభ్రాంతులకు గురిచేశాడు. అంతేకాకుండా ఇంట్లో నుంచి బియ్యం తీసుకొచ్చి ఇస్తే మంచిగా చేస్తానని నమ్మబలికాడు. భయాందోళనకు గురైన లక్ష్మి కొంత బియ్యాన్ని తీసుకొచ్చి ఆ బిచ్చగాడు చేతిలో పెట్టింది. అంతలోనే ఏదో ఏదో రసాయనంతో కూడుకున్న బొట్టును ఆమె నుదుట పెట్టడంతో.. బిచ్చగాడు ఏం చెబితే అది చేసింది. తన కూతురు పావుతులం బంగారాన్ని ఆ బియ్యంలో వేయమని, గంట తర్వాత ఆ బియ్యానిచూడాలని చెప్పి అక్కడి నుంచి జారుకున్నాడు. కొంత సమయం తర్వాత అనుమానం వచ్చిన లక్ష్మి ఆ బియ్యంలో బంగారం కోసం వెతకగా దొరక్కపోవడంతో లబోదిబోమంటూ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వారు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

లారీ ఢీకొని యువకుడు మృతి


రాజు (ఫైల్)

ఓదెల: మండలంలోని మల్లికార్జునస్వామి ఆలయ సమీపంలో లారీ ఢీకొని రూపునారాయణపేట గ్రామానికి చెందిన రాపర్తి రాజు (40) మృతిచెందాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు.. రాజు కావేరి సీడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఓదెల నుంచి పెగడపల్లికి బైక్‌పై వెళ్తుండగా వెనక నుంచి లారీ ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


నిత్య(ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన కాటిపల్లి నిత్య(21) తన స్నేహితులు కళాశాలలో, హాస్టల్‌లో మానసికంగా వేధించారని, క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిత్య హైదరాబాద్‌లోని రిషి ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. అదే కళాశాలలో చదివే వైష్ణవి, సంజన కొద్ది రోజులుగా చదువులో వెనుకబడ్డావని, హేళన చేస్తూ తీవ్ర మానసిక ఇబ్బందులకు గురిచేశారు. మనస్తాపానికి గురై ఈనెల 1న ఇంటికి వచ్చింది. 2వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా వైద్యుల సూచనతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి తండ్రి కాటిపల్లి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

జీడీకే-11 గనిలో కార్మికుడికి గాయాలు


కార్మికుడిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

గోదావరిఖని(రామగుండం): రామగుండం డివిజన్-1 పరిధి జీడీకే-11గనిలో జరిగిన ప్రమాదంలో జి.శ్రీకాంత్ అనే బదిలీ వర్కర్‌కు గాయాలయ్యాయి. గనిలోని 15లెవల్ 15రేస్‌లో బ్లాస్టింగ్ కోసం నలుగురు కార్మికులు సపోర్టింగ్ కోసం డ్రిల్లింగ్ చేస్తుండగా ఈప్రమాదం జరిగింది. పైకప్పు సపోర్టింగ్ చేసిన తర్వాతే డ్రిల్లింగ్ చేయాల్సి ఉండగా సేఫ్టీ సరిగా పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. నలుగురు పనిచేస్తున్న ప్రాంతంలో పైకప్పు కూలడంతో ముగ్గురు దూరం పరుగెత్తి ప్రమాదం నుంచి తప్పించుకోగా యాక్టింగ్ కోల్‌కట్టర్ శ్రీకాంత్‌పై బొగ్గు పెళ్లలు మెడపై పడడంతో గాయాలయ్యాయి. ఇతన్ని హుటాహుటిన గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే గుర్తింపు సంఘం నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోశం ఆసుపత్రికి చేరుకుని కార్మికున్ని పరామర్శించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, మైన్స్ సేఫ్టీ కమిటీ సమావేశాల్లో సేఫ్టీ గురించి మాట్లాడినా.. యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన స్కూల్ బస్సు

- ముగ్గురికి తీవ్ర, ఆరుగురికి స్వల్పగాయాలు


ఘటనాస్థలంలో క్షతగాత్రులు

ముత్తారం(మంథని): మండలంలోని మైదంబండ ప్రధాన రోడ్డుపై శుక్రవారం ప్రైవేట్ స్కూల్‌బస్సు కూలీల ఆటోను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర, ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని కేసనపల్లికి చెందిన సిద్ధి ఉమా, సాగర్ల కీర్తన, కందుల అఖిల, కలవేన కోమల, కొండవేన ఉమ, మానస, మల్లేశ్వరి, చొప్పరి రాధ పోతారానికి చెందిన గాడిచర్ల శంకర్ ఆటోలో రామగిరి మండలం సెవెన్ ఎల్‌బీ గనిలో మొక్కలు నాటడానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో మైదంబండ వద్ద కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను రామగిరి మండలం సెంటనరీకాలనీలోని ప్రగతి హైస్కూల్‌కు చెందిన బస్సు వెనుకనుంచి ఢీకొట్టింది. బస్ డ్రైవర్ పరారీ అయ్యాడు. కూలీలు గాయలు కావడంతో స్థానికులు ప్రైవేటు వాహనాల్లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ శంకర్, కూలీలు ఉమా, కీర్తనకు తీవ్రగాయాలు కాగా, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని ఎస్సై నరేశ్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాల బస్సులను అడ్డుకున్న గ్రామస్తులు


దుద్దెనపల్లిలో ప్రైవేట్ స్కూల్ బస్సును అడ్డుకుంటున్న గ్రామస్తులు


ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులు

సైదాపూర్: ప్రైవేట్ వద్దు.. గవర్నమెంట్ బడి ముద్దు అంటూ గ్రామానికి వచ్చిన ప్రైవేట్ బడి బస్సులను శుక్రవారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. దుద్దెనపల్లిలో బొమ్మనపల్లి, హుజూరాబాద్, తుమ్మనపల్లి నుంచి వచ్చిన ప్రైవేట్ బడి బస్సులను మాజీ ఎంపీటీసీ చాడ చైతన్య, కొండాల్‌రెడ్డి, చిన్న వెంకటేశం ఆధ్వర్యంలో గ్రామ మహిళలు అడ్డుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల మాయాజాలంలో ప్రభుత్వ బడులు మూతపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాలమైన పాఠశాల తరగతి గదులు, మైదానం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులుండగా.. రూ.లక్షలు ఖర్చు చేసి ప్రైవేట్ బడికి పంపాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రైవేట్ బస్సులు గ్రామానికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రైవేట్ బడికి వెళ్తున్న విద్యార్థులను సర్కార్ బడిలో చేర్పించారు.

గూడ్స్ రైలులో చెలరేగిన మంటలు


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట- బల్లార్షా సెక్షన్ల మధ్యలోని పెద్దపల్లి జిల్లా కొలనూర్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం గూడ్స్ రైలునుంచి మంటలు చెలరేగాయి. డొర్నకల్ నుంచి రాముగుండం వైపు వెళ్తుండగా ఇంజిన్ వెనక భాగంలో నాల్గో బోగినుంచి పొగమంటలు రావడంతో కొలనూర్ రైల్వేస్టేషన్‌లో లూప్‌లైనులో నిలిపివేశారు. మిగతా రైళ్లను ప్లాట్‌ఫాం, మెయిన్ లైన్ నుంచి పంపారు. డొర్నకల్ నుంచి జమ్మికుంట దాటగానే బోగినుంచి మంటలు రావడాన్ని గమనించిన లోకోపైలట్ కొలనూర్ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. జమ్మికుంట ఓహెచ్‌టీఆర్డీ ఇన్‌చార్జి సాంబయ్యకు ఈ సమాచారం ఇవ్వగా, సిబ్బంది కొలనూర్ స్టేషన్‌కు చేరుకున్నారు. అప్‌లైనులో ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్లిన తర్వాత విద్యుత్తు సరఫరాను నిలిపివేయగా పెద్దపల్లి ఫైర్‌సిబ్బంది రాంచందర్, అశీష్, శ్రీనివాస్, అనిల్ మంటలను ఆర్పివేశారు.

'పది' విద్యార్థులకు మోదీ కానుక

- 11న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో పంపిణీకి చర్యలు

కరీంనగర్‌టౌన్: ఈనెల 11న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే టెన్త్ క్లాస్ విద్యార్థులకు 20వేల సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్ జిల్లాలో పదో తరగతి చదివే బాలబాలికలు 3,096 మంది, రాజన్న సిరిసిల్లలో 3,841, జగిత్యాలలో 1,137, సిద్దిపేటలో 783, హన్మకొండలో 491 మంది మొత్తంగా 9348 మంది ఉన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 66 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు 50సైకిళ్ల చొప్పున పంపిణీ చేయనున్నారు. ఒక్కో మండలానికి వంద చొప్పున సైకిళ్లను అదనంగా పంపిణీ చేస్తారు. హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో వార్డుకు 50 సైకిళ్ల చొప్పున పంపిణీ చేస్తారు. ఇక గ్రామ పంచాయతీల వారీగా 10 నుంచి 25సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. మొత్తంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 20వేల సైకిళ్లను దశలవారీగా పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఐదువేల సైకిళ్లు ఇప్పటికే కరీంనగర్‌కు వచ్చాయి. సైకిల్ రాడ్‌కు ఒకవైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇంకోవైపు బండి సంజయ్ ఫొటో ముద్రించనున్నారు.

టెన్త్ విద్యార్థులకే ఎందుకంటే

ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుంచి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుంచి స్కూల్ దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సుల్లో వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత స్పెషల్ క్లాసలకు హాజరు కావాల్సి ఉంటుంది. దీనివల్ల పొద్దుపోయేదాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని టెన్త్ బాలబాలికలకు బండి సంజయ్ కుమార్ ప్రధాని మోదీ కానుకగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నారు.

వేదపరీక్షలు.. జ్ఞాన వేదికలు


వేదాలకు సంబంధించిన ప్రత్యేక పరీక్షల్లో గురువులు, శిష్యులు


రాజన్న ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో స్మార్త పరీక్షలకు హాజరైన వేదపండితులు

- వేములవాడలో స్మార్తపరీక్షలు
- హాజరైన పండితులు, అభ్యర్థులు

వేములవాడ: ప్రాచీన భారతీయ విద్యా సంప్రదాయానికి జీవం పోసేలా వేదాల్లో నిపుణులైన పండితుల స్మార్త పరీక్షలు వేములవాడ రాజన్న క్షేత్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. మొదటిసారి తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు పేర్కొన్నారు. శుక్రవారం నాలుగు వేదాలకు సంబంధించిన ఈ స్మార్తపరీక్షల కోసం దేశం నలుమూలల నుంచి వేదపండితులు, విద్యార్థులు హాజరయ్యారు. పూర్వ శిష్టాచారాలను అనుసరించి, వేదభాష్యాలు, స్మృతిగ్రంథాలు, ధర్మశాస్త్ర అంశాల్లో శిక్షణ పొందిన వేదవిద్యార్థుల ప్రావీణ్యాన్ని పరీక్షించేలా ఈ కార్యక్రమం కొనసాగింది. వేద భాష్య పండితులు, అధ్యాపకులు సమగ్రంగా పరీక్షించి విద్యార్థుల విజ్ఞానాన్ని అంచనా వేస్తున్నారు. వేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో స్ఫూర్తిదాయక వేదికను రాజన్న ఆలయంలో ఏర్పాటు చేశారు. భవిష్యత్ తరాలకు ప్రాచీన భారతీయ విజ్ఞాన సంపదను అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా మండపంలో వేదవిద్యార్థులు గురువుల సమక్షంలో తమ జ్ఞానాన్ని ప్రదర్శించారు.

మొదటిసారి స్మార్త పరీక్షలు



వేద విద్యా పరంపరకు ప్రాచుర్యం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో స్మార్తపరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి నిర్వహిస్తోంది. నాలుగు వేదశాఖల ఆధారంగా ఈ పరీక్షలు జరుగుతున్నాయి. దేశం నలుమూలల నుంచి వేద విద్యార్థులు, గురువులు, పండితులు ఈ పరీక్షల కోసం వేములవాడకు విచ్చేశారు.

– డాక్టర్ ముష్టివెంకటనాగశర్మ, తిరుపతి వేంకటేశ్వరస్వామి విశ్వవిద్యాలయం, స్మార్త విభాగం ఇన్‌చార్జి

దేశ నలుమూలల నుంచి హాజరు



దేశ నలుమూలల నుంచి వేదపండితులు, వేద విద్యార్థులు వేములవాడ రాజన్న క్షేత్రంలో జరిగే ఈ స్మార్త పరీక్షలకు హాజరుకావడం విశేషం. ఇందుకు ముందుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్, ఎమ్మెల్యే, ఆలయ ఈవోలకు అభినందనలు. చాలా మంది హాజరు కావడం గొప్ప విషయం.

– తారకరామ కుమారశర్మ, తిరుమల తిరుపతి వేద విశ్వవిద్యాలయం ఆచార్యులు, యజుర్వేద విభాగం ఇన్‌చార్జి

సంతోషంగా ఉంది



ఈ స్మార్త పరీక్షలు వేద గ్రంథాల అధ్యయనం, ధర్మశాస్త్ర అంశాలపై ప్రావీణ్యాన్ని అంచనా వేస్తున్నాయి. అభ్యర్థులూ, పరీక్షకులూ సంప్రదాయ దుస్తుల్లో పరీక్షలలో పాల్గొనడం విశేషం. వేద విద్యార్థులకు ఇది ఎంతో ప్రాముఖ్యత గల అవకాశం. వీరందరికీ ఆలయం ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించాం.

– రాధాభాయి, ఆలయ ఈవో